క్లుప్తంగా

ప్రతి సోమవారం ప్రజావాణి

భూపాలపల్లి రూరల్/ చిట్యాల/కాటారం/మహాముత్తారం/మల్హర్/పలిమెల: కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించనున్నట్లు భూపాపలపల్లి, చిట్యాల, కాటారం, మహాముత్తారం, మల్హర్, పలిమెల తహసీల్దార్లు శ్రీనివాసులు, ఖాజా మోహనొద్దీన్, నాగరాజు, శ్రీనివాస్, రవికుమార్, హేమలు శుక్రవారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి 1 గంటల వరకు ప్రజల సమస్యలపై దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొనే ఏ శాఖలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసమైన ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

2న 'రైతు భరోసా'పై సమావేశం

కాళేశ్వరం: మహదేవపూర్, పలిమెల మండలాల రైతులకు జూలై 2న రైతు భరోసా విధివిధానాలపై మహదేవపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సంఘ సభ్యులతో జిల్లా అధికారి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ తిరుపతయ్య ఒక ప్రకటనలో శుక్రవారం పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంఘ సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఒకరికి గాయాలు

రేగొండ: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయలైన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన నూనె శివాజీ మండల కేంద్రంలోని హెచ్‌పీ బంక్‌లోకి వెళ్తుండగా బంక్ నుంచి బయటకు వస్తున్న కారును ఢీ కొనడంతో గాయాలపాలయ్యాడు. స్పందించిన స్థానికులు 108 కు సమాచారం అందించగా క్షతగాత్రుడిని పరకాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



వెంకటాపురం(కె): మండల పరిధిలోని నాయకులగూడెం గ్రామంలో కాఫెడ్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సేంద్రియ వ్యవసాయం, కిచెన్ గార్డెన్‌ల పెంపకంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఈఓ శ్యామ్ సుందర్ హాజరై మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయానికి ఖరీదైన ఎరువులు, పురుగు మందులు వాడాల్సిన అవసరం లేదని అన్నారు. సేంద్రియ ఉత్పత్తులు ఆరోగ్యానికి మంచివని అన్నారు. పెరటిలో ఉన్న కాళీ స్థలంలో కిచెన్ గార్డెన్ పెంచుకోవటం వల్ల కలిగే లాభాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కాఫెడ్ స్వచ్ఛంద సేవ సంస్థ సిబ్బంది గొంది హనుమంతు, ఇందిరా, ఉషబూరాణి, పద్మ, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

ఎస్సైని కలిసిన నాయకులు



ఏటూరునాగారం: ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన తాజొద్దీన్‌ను శుక్రవారం నాయకపోడు సేవ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానించారు. నాయకులు సమ్మయ్య, గండేపల్లి నర్సయ్య, కోడి గోపాల్, గండేపల్లి సత్యం, పున్నం రమేష్, చింతకుంట్ల మైనర్ బాబు, బుచ్చి మల్లయ్య, సతీశ్ తదితరులు ఉన్నారు.

సన్మానం

వెంకటాపురం(కె): చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్‌ను శుక్రవారం ఏటూరునాగారం ఐటీడీఏ అతిథి గృహంలో మంత్రి సీతక్క సన్మానించారు. సాయి ప్రకాశ్‌ను భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు కావాల్సిన రక్తన్ని అందించే మంచి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏటూరునాగారం మండల అధ్యక్షుడు చిటమట రఘు, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ ఖాన్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ తదితరులు ఉన్నారు.

పరామర్శ

ములుగు రూరల్: మల్లంపల్లి మండల సాధన సమితి అధ్యక్షుడు రాజు తండ్రి భిక్షపతి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతిగౌడ్ శుక్రవారం పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ గుగ్గిళ్ల సాగర్, నూనె శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రోడ్డుపైనే వారసంత

కూరగాయలు అమ్ముతున్న వ్యాపారులు



- స్థలం లేక కూడలిలోనే నిర్వహణ
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, వాహనదారులు



రోడ్డుపైనే కొనసాగుతున్న సంత

మహాముత్తారం: వారాంతపు సంతకు సరైన స్థలం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం వచ్చిందంటే మండలంలోని యామన్‌పల్లి ప్రధాన కూడలిలోని రోడ్డు వద్ద వారసంతను ఏర్పాటు చేసి వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. ఈ వారసంతకు ఆజాంనగర్, కాటారం, మహదేవపూర్ లాంటి పట్టణ ప్రాంతాల నుంచి కూరగాయలు, పండ్లు, బట్టలు పలు రకాల వస్తువులు అమ్ముకోవడానికి ఆటోల ద్వారా ఈ సంతకు వస్తుంటారు. ఈ వారసంతలో మండల కేంద్రంతో పాటు యామన్‌పల్లి, నిమ్మగూడెం, డొబ్బలపాడ్, కొర్లకుంట, మాదారం, స్థంబంపల్లి, కోనంపేట తదితర గ్రామాల నుంచి ప్రజలు వచ్చి ఈ సంతలో వారికి కావల్సిన వస్తువులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతుంటారు. రోడ్డుపై వ్యాపారం కావడంతో వస్తువులు కొనుగోలు చేసే వినియోగదారులు వ్యాపారులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సంత సాయంకాల సమయంలో నిర్వహించడంతో కరెంటు సౌకర్యంలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రాకపోకలకు వస్తువులను వాహనాల్లో తీసుకు వచ్చేవారు రోడ్లపై ఏర్పాటు చేయడం వల్ల స్థానికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుంది. సంతకోసం వ్యాపారులు వినియోగదారుల కోసం గ్రామపంచాయతీ అధికారులు శాశ్వతంగా సంతకు స్థలాన్ని ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

> **స్థలాన్ని కేటాయించాలి**
>
> ప్రజల అవసరాలకు అనుగునంగా సంతకోసం స్థలాన్ని కేటాయించాలి. రోడ్లపై వ్యాపారం వల్ల ప్రజలు వినియోగదారులకు ఇబ్బందిగా ఉంటుంది. గ్రామస్తులు, గ్రామపంచాయతీ అధికారులు ఆలోచన చేసి వారసంతకోసం స్థలాన్ని ఎంపిక చేయాలి.
>
> – అట్టెం రమేష్, యామన్‌పల్లి

పీవీ సేవలు చిరస్మరణీయం



పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కాళేశ్వరం: దేశానికి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు చేసిన సేవలు చిరస్మరణీయం అని ప్రిన్సిపాల్ ఎం.నర్సయ్య అన్నారు. మహదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీవీ నరసింహారావు జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక సంస్కరణల గురించి కొనియాడారు. ఆయన బహుభాషా కోవిందుడని భారతదేశానికి ఎన్నో రకాల పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చి ప్రభుత్వాన్ని నడిపినటువంటి ఒక గొప్ప నాయకుడని అన్నారు. ఆయన అడుగుజాడల్లో నడువాలని విద్యార్థులకు సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రమేష్, అధ్యాపకులు సరిత ,సమ్మయ్య, సదాశివ్, సదానందం రమాదేవి ,శైలజ ,రాజయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాల్లో ఆశలు కీలకం

డాక్టర్ అనురాధ



మాట్లాడుతున్న డాక్టర్ అనురాధ మెడోజు

ములుగు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాల్లో క్షేత్రస్థాయిలో ఆశ కార్యకర్తలది కీలకపాత్ర అని నేషనల్ హెల్త్ మిషన్ తెలంగాణ సీనియర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ మెడోజు అన్నారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లతో ఏర్పాటు చేసిన సమావేశం డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య అధ్యక్షతన నిర్వహించగా డాక్టర్ అనురాధ మాట్లాడారు. నేషనల్ హెల్త్ మిషన్ తరపున అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, అమలు చేస్తున్న విధానానంపై వైద్యాధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. వైద్యాధికారి ప్రతి ఆరోగ్య కార్యక్రమానికి ఒక మార్గదర్శిగా, మంచి అడ్మినిస్ట్రేటర్‌గా ఉండాలని తెలిపారు. వైద్యాధికారి రోగులతో కుటుంబ సభ్యుడిలా, స్నేహితుడిలా ఉంటూ వారికి ట్రీట్‌మెంట్ ఇవ్వాలని అన్నారు. బాధ్యతాయుతంగా మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందించాలని తెలిపారు. వైద్యుడిగా సేవలందించడం ఒక బాధ్యతగా, గర్వకారణంగా భావించాలని సూచించారు. దేశంలో పటిష్టమైన వైద్య నియమాలతో కోవిడ్ వంటి అతి క్లిష్టమైన సమయంలో కూడా ప్రజలకు సేవలు అందించామని గుర్తుచేశారు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సేవలను జిల్లా ఆస్పత్రి, ఏరియా హాస్పిటల్, సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. జిల్లాలో మాతృ మరణాల సంఖ్య తగ్గించినందుకు వైద్య సిబ్బందిని అభినందించారు. హెల్త్ పొవైడర్లు నాలుగు సూత్రాలను పాటించాలని.. ముఖ్యంగా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. త్వరగా రోగనిర్ధారణ పరీక్షలు చేసి రిపోర్టుల ఆధారంగా చికిత్స అందించాలని తెలిపారు. ఆరోగ్యక్షేమం కోసం యోగా, మెడిటేషన్ అందించాలని అన్నారు. క్లిష్టమైన కేసులను మాత్రమే మండల, జిల్లా ఆస్పత్రులకు రెఫర్ చేయాలని తెలిపారు. డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ.. జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలుపరిచేందుకు వైద్యాధికారులు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. జయశంకర్ భూపాలపల్లి డీఎంహెచ్ఓ డాక్టర్ చల్లా మధుసూదన్ మాట్లాడుతూ.. గత రెండు రోజుల నుంచి అనురాధ మెడోజ్ ఇచ్చిన సలహాలు సూచనలు తూచా తప్పకుండా జిల్లాలో అమలు చేస్తామని అన్నారు. సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రవీందర్, డాక్టర్ పవన్, డాక్టర్ శ్రీకాంత్ ఉన్నారు.

మెరుగైన పరిహారం చెల్లిస్తాం..



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

భూపాలపల్లి అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని గడ్డిగానిపల్లి గ్రామ ప్రజలకు మెరుగైన పరిహారం చెల్లిస్తామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఓపెన్‌కాస్ట్–2 ప్రాజెక్ట్‌లో భూమి కోల్పోతున్న గడ్డిగానిపల్లి గ్రామ ప్రజలకు శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఓసీ–2లో నివాస గృహాలు, వ్యవసాయ భూములు కోల్పోతున్న ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం చెల్లించనున్నట్లు చెప్పారు. 522 నివాస గృహాలు ఉన్నాయని, వాటిస్థానంలో మెడికల్ కళాశాల సమీపంలో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ఇంటి స్థలాలు, నష్ట పరిహారం ఇస్తామన్నారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ.. ప్రధాన రహదారి నుంచి కాలనీ వరకు 60 ఫీట్ల రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, కాలనీలో రెండు దేవాలయాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఇందుకు అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ మంగీలాల్, సింగరేణి జీఎం హబీబ్‌హుస్సేన్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న మమాంక్‌యాదవ్

ములుగు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ మమాంక్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. ఏబీవీపీ నాయకులు గేట్లు దూకె ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మమాంక్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నామని చెప్పి ఆచరణలో మాత్రం కనబడుట లేదని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కుక్కలు, పందులకు ఆవాసాలుగా మారుతున్నాయని అన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో యాజమాన్యాలు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, అధిక ఫీజులు చేస్తూ నిరుపేద విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ప్రైవేటు పాఠశాలల దోపిడీపై సమాచారం అందిస్తే చర్యలు తీసుకోని పరిస్థితిలో విద్యాశాఖ ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జశ్వంత్, శ్రీతాన్, నవనీత్, రోహత్, కార్తిక్, పూర్ణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ములుగు రూరల్: మండలంలోని బండారుపల్లి మోడల్ పాఠశాలలో 6వ తరగతి నుంచి పదవ తరగతి వరకు హింది సబ్జెక్ట్ బోధించేందుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శోభరాణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హవర్లీ బేస్డ్ టీచర్(హెచ్‌బీటీ) పోస్టుకు జూలై 02 లోపు దరఖాస్తులను పాఠశాలలో సమర్పించాలని అన్నారు. 03న డెమో నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు.

ఉన్నతస్థాయికి చేరుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

మహాముత్తారం: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత చదువులు చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని మహాముత్తారం ఎస్సై మహేందర్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని డొబ్బలపాడులోని మోడల్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వాడకం వల్ల ఆరోగ్యం చెడిపోవడమే కాకుండా మానసికంగా తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి గురువులకు తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సింగరేణి పరిరక్షణకు సమష్టి పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఐక్య కార్మిక సంఘాల నాయకులు

భూపాలపల్లి అర్బన్: సింగరేణి పరిరక్షణకు అన్ని సంఘాలు కలిసి సమష్టి పోరాటాలు నిర్వహించాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ రియాజ్ అహ్మద్ కో కన్వీనర్ కృష్ణ కోరారు. భూపాలపల్లి ఏరియాలోని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య ఆధ్వర్యంలో సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి ప్రాంతంలో ఉన్నటువంటి ఆరు బొగ్గు గనుల వేలం వేసే ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు వెన్నెముక లాంటి సింగరేణి పరిశ్రమను కాపాడుకునే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు కృష్ణ, పోచమల్లు, నారాయణ, రాజన్న, నరేష్, సత్యం, మల్లేష్, జనార్దన్, ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ అవంతిక

మొగుళ్లపల్లి: నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూల్‌లుగా తీర్చిదిద్దటానికిగాను అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇవ్వటం జరుగుతుందని సీడీపీఓ అవంతిక అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని రెండు సెక్టర్లలోని 37 మంది అంగన్‌వాడీ టీచర్లకు సీడీపీఓ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ రజిత, సంధ్యారాణి ,జయప్రదలు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్ణయంలో భాగంగా భూపాలపల్లి ప్రాజెక్టులోని మొగుళ్లపల్లి మండలంలో 3 రోజులు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. పూర్తి శిక్షణ పొందిన టీచర్స్‌తో ప్రీ స్కూల్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అంగన్‌డీ కేంద్రంలో 3 నుండి 5 సంవత్సరాల పిల్లలను చేర్పించాలని కోరారు. అనంతరం ప్రియదర్శిని పూర్వ ప్రాథమిక వాచకం–1, పూర్వ ప్రాథమిక విద్యా కరదీపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



కాటారం: నిల్వ నీటిని పారబోయిస్తున్న సిబ్బంది



వాజేడు: టైర్లలోని నీటిని పారబోస్తున్న సిబ్బంది

కాటారం: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరంగా ఉంటాయని మండల వైద్యాధికారిణి డాక్టర్ మౌనిక అన్నారు. మండల కేంద్రంలో డ్రై డేలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశ కార్యకర్తలు ప్రతి ఇంటిలో నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

వాజేడు: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వాజేడు వైద్యాధికారి మధుకర్ అన్నారు. శుక్రవారం వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి నిలువ ఉన్న నీటిని, ప్లాస్టిక్ వస్తువుల్లో ఉన్న నీటిని పార బోశారు.

న్యాయం చేయాలని వినతి



సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న దళితులకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం ఏటూరునాగారం పర్యటనకు వచ్చిన మంత్రి సీతక్కకు ఆదివాసీ దళిత సేవ సంఘం ఆధ్వర్యంలో వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఎడీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పరికి శ్రీనివాస్ మాట్లాడుతూ మండల పరిధిలోని దొడ్ల కొత్తూరు, గ్రామానికి చెందిన దళితులు 24 సంవత్సరాలుగా పోడుభూములను సాగు చేసకుంటున్నారని అన్నారు. దళితుల భూమిని కొందరు గిరిజనులు దళితుల భూమిపై నకిలి పత్రాలు తయారు చేసుకోని దళితులను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా దళితుల పోడు భూములకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజు, సత్యం, శ్రీను, రాజయ్య తదితరులు ఉన్నారు.

క్రేన్ మధ్యలో చెట్టు!



క్రేన్ మధ్యలో పెరిగిన వేప చెట్టు

టేకుమట్ల: క్రేన్ మధ్యలో చెట్టు చూపరులను ఆశ్చర్యానికి గురి చేసే చిత్రం 'సాక్షి' కెమెరాకు శుక్రవారం చిక్కింది. వివరాల్లోకి వెళ్తే ఐదు సంవత్సరాల క్రితం మండల కేంద్రానికి చెందిన మేకల దేవేందర్, వెంకటేష్ అనే ఇద్దరు సోదరులు క్రేన్‌ను రామకిష్టాపూర్(టి) గ్రామానికి చెందిన సల్పాల ఓదెలు అనే రైతు వ్యవసాయ బావిలో పూడిక తీసేందుకు బావి వద్ద ఏర్పాటు చేశారు. పని పూర్తి అయ్యాక తీసుకెళ్దాం అనే ఉద్దేశ్యంతో బావి వద్దనే క్రేన్‌ను ఉంచారు. అనంతరం ఇద్దరు సోదరులు వేర్వేరు వ్యాపారాలు కొనసాగించడంతో ఇప్పటికీ అక్కడే క్రేన్ ఉండిపోయింది. దాంతో క్రేన్ మధ్య భాగంలో వేప చెట్టు పెరిగింది.


వ్యాధులపై అప్రమత్తత అవసరం



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న వైద్యులు ప్రధాన్

భూపాలపల్లి రూరల్: ప్రజలు వర్షకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని భూపాలపల్లి ప్రదాన్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ ప్రదాన్ సూచించారు. శుక్రవారం భూపాలపల్లి మండలలోని కొంపెల్లి గ్రామంలో వంగ వెంకటమ్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు కుమారస్వామి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి జిల్లా కేంద్రంలోని ప్రదాన్ ఆస్పత్రి డాక్టర్ ప్రదాన్, ఎమర్జెన్సీ క్రిటికల్ కేర్ డాక్టర్ లింగమూర్తి హాజరై వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు 350 మందికి రూ.2 లక్షల విలువైన మందులను ఉచితంగా అందించారు. వైద్య సేవలు అందించిన ప్రదాన్ ఆస్పత్రి వ్యవస్థాపకుడు తౌటం ప్రభాకర్‌కు, వైద్యులు ప్రధాన్, లింగమూర్తిలకు నిర్వాహకులు కుమారస్వామి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు మద్రి కృష్ణమూరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలం ఆపాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్ రెడ్డి

గోవిందరావుపేట: బొగ్గుగనుల వేలం ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్ రెడ్డి అన్నారు. పస్రాలో శుక్రవారం నిర్వహించిన సీసీఎం మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా గనులను వేలం వేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. బొగ్గు గనులని ప్రైవేటీకరించమని పేర్కొంటూనే వేలం పాటలు నిర్వహించడం దారుణమన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా సింగరేణి మీద ఆధారపడి 80వేల మంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో గోవిందరావుపేట మండల కార్యదర్శి తీగల ఆదిరెడ్డి, సోమ మల్లారెడ్డి, కడారి నాగరాజు, అంబాల మురళి, యానాల ధర్మారెడ్డి, పల్లపు రాజు, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ప్రభుత్వ ఆస్పత్రి

ములుగు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వానంగా ఉందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భూక్య జంపన్ననాయక్ అన్నారు. నాయకులతో కలిసి శుక్రవారం ఆయన జిల్లాకేంద్రంలోని ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆస్పత్రిలోని పరిసరాలు అపరిశుభ్రంగా, మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయని అన్నారు. చేతులు శుభ్రం చేసుకోవడానికి వెళ్తే సింక్‌ను చూసి వెనక్కి రావాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. కనీసం నీళ్లు రావడం లేదని వాపోయారు. ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆస్పత్రుల నిర్వహణ అని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన ఓ సమావేశంలో ప్రభుత్వ ఆసుపత్రులు అంటే అమ్మలాంటివి అని కాంగ్రెస్ పెద్దలు చెప్పారని తీరా ఆస్పత్రిని చూస్తే అధ్వాన్నంగా ఉందని వాపోయారు. రోజువారిగా వచ్చే ఓపీ, ఐపీలకు సరిపడా డాక్టర్లు లేరని అన్నారు. ఆపదలో ఆస్పత్రికి వస్తే డాక్టర్లు వరంగల్కు రిఫర్ చేయడం ఏంటని అడిగారు.